కోటంక చెరువును నింపండి

మంత్రి పయ్యావుల కేశవ్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గార్లదిన్నె మండలం కోటంక చెరువును హంద్రీనీవా నీటితో నింపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్ కోరారు. ఈమేరకు శనివారం నగరంలోని మంత్రి స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూడేరు మండలం పొడిచెరువు గ్రామ చెరువు నుంచి కోటంక చెరువుకు సహజ వంక ఉందన్నారు. దాని ద్వారా నీరు ఇవ్వాలని కోరారు. కోటంక చెరువుకు నీరు ఇస్తే భూగర్భజలాలు చిన్న, సన్నకారు రైతులు పంటలు సాగు చేస్తారన్నారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ సమస్య చాలా కాలంగా ఉందని, రెండు గ్రామాల రైతులతో మాట్లాడి పరిష్కరిచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గార్లదిన్నె మండల కార్యదర్శి చెన్నారెడ్డి, గ్రామ రైతులు నాగార్జున, నారాయణ రెడ్డి, రవి, ఆదినారాయణ, సూర్యచంద్రారెడ్డి, వెంకట తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

అత్యధికం ఏకగ్రీవం



పామిడి మండలంలోని సాగునీటి సంఘాలకు ఎన్నికైన సభ్యులు

ప్రజాశక్తి- అనంతపురం

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రశాంతంగా ముగిశాయి. ఇందులో అత్యధికం ఏకగ్రీవమయ్యాయి. అధికారపార్టీకి చెందిన నాయకులు అధ్యక్ష , ఉపాధ్యక్ష స్థానాలను కైవసం చేసుకున్నారు. అనంతపురం జిల్లాలో 143 కు గాను 141కి జరిగాయి. కూడేరు మండలం పొట్టిచెరువు, బెళుగుప్ప మండలంలోని శీర్పి సాగునీటి సంఘాలకు వాయిదా పడ్డాయి. హెచ్ఎల్‌సి పరిధిలో 48 కాగా, బిటిపి పరిధిలో ఆరు, మైనర్ ఇరిగేషన్ 89 సంఘాలకు ఎన్నికలు జరిగాయి. వీటిల్లో అత్యధికం ఏకగ్రీవమయ్యాయి. ఉదయం టిసి సభ్యుల ఎంపిక జరిగింది. ఆ తరువాత మధ్యాహ్నం నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరిగాయి. యల్లనూరు మండలంలో ఉదయం కొంత ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నా తరువాత పోలీసులు దాన్ని సద్దుమణిచారు. తరువాత ఎక్కడా ఎటువంటి సమస్యలేకుండా సాగునీటి సంఘాల ఎన్నికలు ముగిశాయి. ఇక సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని రొద్దం మండలం కోగిర గ్రామం నీటి పారుదల సంఘం ఎన్నికల విషయంలో ఎంపీ పార్థసారధి, మంత్రి సవిత వర్గీయుల మధ్య వివాదం నెలకొంది. అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని ఎంపీ వర్గీయులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తమ వర్గానికి చెందిన వారిని నామినేషన్లు వేయకుండా ఎన్నికల అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని ఎంపీ వర్గీయులు ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. ఇక సత్యసాయి జిల్లాలో 230 సాగునీటి సంఘాలుండగా అన్నీ ఏకగ్రీవమయ్యాయి.

ఈనెల 17న డిస్ట్రిబ్యూటరీలకు ఎన్నికలు

సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా సాగాయి. ఈనెల 17వ తేదీన డిస్ట్రిబ్యూటరీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ మేరకు వాటిని కూడా ఎక్కడా ఇబ్బంది కలుగకుండా సజావుగా జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు

ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకుందాం..

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

మానవహక్కుల వేదిక మహాసభలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

ప్రజాస్వామిక హక్కులను పాలకులు కాలరాస్తున్నారని పలువురు వక్తలు విమర్శించారు. ప్రజాచైతన్యం ద్వారానే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని యాపిల్ ఫంక్షన్ హాలులో మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభ శనివారం ప్రారంభమైంది. ఈ మహాసభకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రారంభ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ మానవహక్కుల వేదిక అధ్యక్షులు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభ సభలో డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ నిత్యం కరువుకు నిలయమైన అనంతపురం జిల్లా పౌర ఉద్యమాలకు పెట్టింది పేరు అని అన్నారు. మానవహక్కుల వేదిక ఉద్యమంతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా పంచుకున్నారు. 2009లో అనంతపురంలో జరిగిన మానవహక్కుల వేదిక మూడవ రాష్ట్ర మహాసభల్లోనూ బాలగోపాల్‌తో కలసి పాల్గొన్నట్టు గుర్తు చేశారు. అనంతరం దేశంలో ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక స్థితిగతులతోపాటు, ప్రజాఉద్యమాలను పాలకులు ఏ రకంగా అణచివేస్తున్నారన్న విషయాలను ఆయన తెలియజేశారు. ప్రజాచైతన్యంతోనే ఈ విధానాలను తిప్పికొట్టగలమని సూచించారు. ఈ మహాసభ నిర్మాణాత్మకంగా జరిగి విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఓపిడిఆర్ నాయకులు రామ్‌కుమార్ పాల్గొని సౌహార్ధసందేశాన్ని ఇచ్చారు. నేడు దేశంలో ప్రశ్నించే గొంతుకలను నిర్దాక్షిణ్యంగా పాలకులు అణచివేస్తున్నారని విమర్శించారు. ఆదివాసి సమస్యలపై పోరాడే స్టాలిన్‌ను ఏరకంగా నిర్బంధించి చంపేశారన్నది చూసామని చెప్పారు. ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాల తరపున గొంతేందుకు పౌరహక్కుల సంఘాలు మరింతగా ముందుకు పోవాల్సిన అవసరంఉందని చెప్పారు. ఈ ఉద్యమంలో కలిసొచ్చే అందరితోనూ తాము పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భుజంగరావు మాట్లాడుతూ దేశంలో ప్రజా సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఈ క్రమంలో మానవ హక్కులు సైతం హరించివేయబడుతున్నాయని అన్నారు. ప్రధానంగా అటవీసంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే క్రమంలో ఆదివాసీలను నిర్వాసితులుగా మార్చేస్తున్నారని తెలిపారు. వారి హక్కులను పాలకులు కాలరాస్తున్నారన్నారు. డెమోక్రటిక్ పీపుల్స్ ఫోరం నాయకులు శ్రీధర్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకులను ఫేక్ ఎన్‌కౌంటర్ల పేరుతోనూ, ఇతర రూపాల్లోనూ అణచివేస్తున్నారన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్య తీసుకురావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్ రసూల్, ఎస్ఎం.బాషా, జిల్లా నాయకులు సుబ్బన్న, ఆహ్వాన సంఘం నాయకులు దాదా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మహాసభ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, వేదికమీద కూర్చొన్న ప్రముఖులు

నగరంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న నాయకులు, తదితరులు

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ఉద్యోగానికి ఎంపికైన యువతికి నియామక పత్రం అందజేస్తున్న మంత్రి కేశవ్

ప్రజాశక్తి - ఉరవకొండ

ఉరవకొండలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. ఉరవకొండ పట్టణంలోని ఎస్‌కె. జూనియర్ ప్రభుత్వ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు 60 కి పైగా కంపెనీలు వారి ప్రతినిధులను పంపించారన్నారు. వీరు దాదాపు 5వేల మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ మేళాలో 7,10వ తరగతి, ఇంటర్మీడియట్ చదివిన వారిపై ప్రధానంగా దృష్టి సారించామని అన్నారు. బాగా చదువుకున్న వారు బయటకు పోయి ఇంటర్వ్యూలలో పాల్గొనగలుగుతారని చెప్పారు. 7వ, 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదివిన వారికి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ మెగా జాబ్ మేళాను ఇక్కడికి తీసుకురావడం జరిగిందన్నారు. కంపెనీలు ఉదయం నుంచి సాయంత్రంలోపే జాబ్ సెలక్షన్ ఇంటర్వ్యూలు చేసే ఏర్పాట్లు చేశామన్నారు. ఇది మొదలు మాత్రమేనని, దీనిని రెగ్యులర్ నిర్వహిస్తామని వివరించారు. ప్రజలు వారి పిల్లల కోసం ఏమి కోరుకుంటున్నారో దానిని నెరవేర్చడమే లక్ష్యంగా పిల్లలను స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లకు పంపించి,ప్రభుత్వ ఖర్చులతో వారికి శిక్షణ ఇప్పించిఉద్యోగాలు వచ్చేలా చేయడానికి తాము చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇది ప్రారంభం మాత్రమేనని, ఇలాంటి జాబ్ మేళాలు భవిష్యత్తులో కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉద్యోగం రానివారు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని మరిన్ని అవకాశాల కోసం మీ నైపుణ్యతను పెంపొందించు కోవాలని సూచించారు. వివిధ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించి,మరింత మెరుగ్గా, సులభతరంగా, నాణ్యతతో, పారదర్శకంగా జాబ్ మేళాను నిర్వహించాలని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలలో ఎంపికైన యువతీ యువకులకు నియామక పత్రాలను మంత్రి అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని దానిలో మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాస్, ఉరవకొండ తహశీల్దార్ మహబూబ్ బాషా, ఉరవకొండ రూరల్,అర్బన్ సిఐలు చిన్న గౌస్, మహానంది, ఆయా శాఖల అధికారులు,ఆయా కంపెనీల ప్రతినిధులు,పెద్ద ఎత్తున నిరుద్యోగులు,టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో కల్తీని నివారించాలి

ప్రజాశక్తి-రాప్తాడు

పెట్రోల్ బంకులో కల్తీని నివారించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పంగల్‌రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంగల్ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకులో కల్తీ పెట్రోల్ పడుతుండటంతో వాహనాలు దెబ్బతింటున్నాయన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత పెట్రోల్ బంకు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, రాప్తాడు మండల కార్యదర్శి పోతలయ్య, సిఐటియు నాయకులు బ్రహ్మ, సుబ్బారావు, మధు, మల్లేష్, ప్రతాప్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

తాడిపత్రి జూనియర్ కళాశాల మైదానానికి మహర్దశ

రూ.15లక్షలతో అభివృద్ధి పనులు- క్రీడాకారుల హర్షం

ప్రజాశక్తి-తాడిపత్రి

మైదానంలో సాగుతున్న అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి చొరవతో పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానానికి మహర్దశ పట్టింది. ఎమ్మెల్యే దాదాపు రూ.15 లక్షల సొంత నిధులు వెచ్చించి మైదానానికి అన్ని హంగులు తీర్చిదిద్దుతున్నారు. ఆయా పనులను సీనియర్ క్రీడాకారులు సుధీర్‌రెడ్డి, కందన్ దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. అస్మిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి తనదైన రాజకీయ మార్క్ చూపిస్తున్నాడు. అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించడం.. వారికి సమస్యల పరిష్కారం సూచిస్తూ ఒక ఎమ్మెల్యేగా తానేం చేయగలనో అన్నది ఒక్కొక్కటిగా ప్రజలకు చేతల్లో చూపిస్తున్నాడు. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశంలో సాగునీటిపై మాట్లాడిన తీరు, సాగునీటిపై 'యువ రైతుల పెళ్లిలు' ఆధారపడి ఉన్నాయన్న సున్నిత సమస్యను అధిష్టానానికి తెలిజేయడం చూస్తే ఆయనకు ఉన్న సమాజ స్పృహకు అద్దం పడుతోంది. గత పదేళ్లుగా తాడిపత్రి నియోజకవర్గం తరుపున అసెంబ్లీలో గళమెత్తిన గొంతే లేదంటే విస్మయం చెందాల్సిందే. ఈనేపథ్యంలో చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని పదే పదే చెప్పే యువనేత ఆ దిశగానే అడుగులు వేస్తున్నాడు. వర్షం నీటితో కుంటను తలపించే జూనియర్ కళాశాలలోని క్రీడా మైదానాన్ని సొంత నిధులతో ఆధునీకరించి క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకున్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

సొంత నిధులతో కళాశాల మైదానాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డికి కృతజ్ఞతలు. నేను 30ఏళ్లకుపైగా ఇదే మైదానంలో ఆడుతున్నా. గతంలో కొంతమేరకు బాగున్నా ఇటీవల వర్షం నీటి నిల్వతో మైదానం అధ్వాన్నంగా తయారైంది. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే ముందుకు వచ్చి మైదానం అభివృద్ధికి పూనుకోవడం గర్వించదగ్గ విషయం. నాకు ఉన్న ఇద్దరు కూతుళ్లు కూడా ఆర్డీటీ క్యాంపులో ఇదే మైదానంలో శిక్షణ పొందుతున్నారు. ఏదిఏమైనా క్రీడాకారులకు మైదానాన్ని అన్నిఅంగులతో ఏర్పాటు చేయడం సంతోషకరం.

- సీనియర్ క్రీడాకారుడు అబ్దుల్

మైదానానికి పూర్వ వైభవం

ఎమ్మెల్యే చొరవతో కళాశాల మైదానానికి పూర్వ వైభవం రావడం సంతోషకరం. ఈ మైదానంలో క్రీడలతోపాటు వ్యాయామం, పోలీసు ఉద్యోగాలకు పలువురు సాధన చేస్తూ ఉంటారు. అలాంటి చరిత్ర ఉన్న మైదానం తిరిగి అభివృద్ధికి నోచుకోవడం ఆనందం. ఆర్డీటీ క్యాంపులో 60 మందికిపైగా క్రీడాకారులు హాజరవుతున్నారు. వారందరికీ కొద్దిపాటి శిక్షణ ఇవ్వడానికి ఇబ్బందిగా ఉండేది. ఇక నుంచి ఆ సమస్య ఉండదు. ఇప్పటికే కొందరు క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారన్నారు. క్రికెట్ మైదానం పనులు పూర్తయితే మరింది రాణించే అవకాశం ఉంది.

- ఆర్డీటీ కోచ్ భార్గవ్

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర మైనారిటీ సంక్షేమ సలహాదారులు ఎంఎ. షరీఫ్

ప్రజాశక్తి - అనంతపురం

రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సలహాదారులు మహమ్మద్ అహ్మద్ షరీఫ్ తెలిపారు. శనివారం ఉదయం అనంతపురం జిల్లా పరిషత్‌లోని డిఆర్‌సి సమావేశ హాల్ లో తెలుగుదేశం పార్టీ సీనియర్ మైనారిటీ నాయకులు అల్ హజ్ ఎం.ఏ. షరీఫ్‌కు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ముస్లిం మైనారిటీ సంఘాలు ,మత పెద్దలు , ప్రభుత్వ ఖాజీలు, క్రిస్టియన్ మైనార్టీ సంఘాల ప్రతినిధులు తదితరులు ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎ. షరీఫ్ మాట్లాడుతూ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ముస్లిం సమాజం టిడిపికి మద్దతు పలకడం వల్లే గొప్ప మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటైందని అన్నారు. కూటమి ప్రభుత్వం ముస్లిం సమాజం అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకొని ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో పాలకులు ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో ముస్లింల సంక్షేమం అభివృద్ధి కోసం గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్ర బడ్జెట్లో రూ.4,376 కోట్లు నిధుల కేటాయింపు చేసిందని చెప్పారు. అంతేగాక మైనార్టీ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు, డీఎస్సీ కోచింగ్ తదితర కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్రం తీసుకున్న వక్ఫ్ చట్టం సవరణ నిర్ణయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సరైన నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. రానున్న రోజుల్లో కూడా ముస్లింలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలుగుదేశం పార్టీతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమని షరీఫ్ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన వారితో వివిధ సమస్యలతో కూడిన వినతులను ఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్లు సాలార్ భాష ,గౌస్ మొహిద్దీన్, ఫిరోజ్, తాజ్ , బాబా ఫక్రుద్దీన్, మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్ మొహమ్మద్ , క్రిస్టియన్ మైనారిటీ సంఘాల ప్రతినిధులు స్వామిదాస్, కార్పొరేటర్ బాబా, ముస్తఫా మౌలానా, మౌలానా ప్రభుత్వ ఖాజీహారున్, ఇస్మాయిల్, సైఫుద్దీన్, వివిధ ముస్లిం మైనార్టీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సలహాదారులు ఎంఎ. షరీఫ్

ఉపాధి ఆశలు నెరవేరేనా.. ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికారంలోకి వచిక్చన కూటమి ప్రభుత్వం అభివృద్ధి అంశంపై పెద్దఎత్తున ప్రచారం చేపడుతోంది. కొత్తగా పరిశ్రమలను తీసుకొస్తామన్న హామీలను ఇస్తూ వస్తోంది. ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలోనూ ఈ అంశాన్నే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. అంతేకాకుండా ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాలను గుర్తించి పారిశ్రామిక క్లస్టర్లను ప్రకటించారు. అయితే ఇవి చాలా వరకు గతంలోనే గుర్తించినవిగా ఉండటం గమనార్హం. 2014కు ముందు నుంచే పరిశ్రమల పేరుతో రైతుల నుంచి భూములు తీసుకున్నవే ఉన్నాయి. లేపాక్షి నాలెడ్జ్ హబ్ స్థలాన్ని ఇప్పుడు క్లస్టర్‌గా చెబుతున్నారు. అయితే ఇక్కడ సేకరించిన భూమి 2009కు ముందే కావడం గమనార్హం. 8844 ఎకరాలను సేకరించి పరిశ్రమలు ఏర్పాటు చేయకుండానే తాకట్టు పెట్టి రూ.700 కోట్లు రుణం తీసుకున్నారు. అంతేకాకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అవినీతి కేసుల్లో ఈ ఆస్తులను ఎన్‌ఫోర్సుమెంటు సంస్థ జప్తు చేసి ఉంది. ఈ స్థలం ఇప్పటికీ వృధాగా పడి ఉంది. పరిశ్రమలు రాలేదు. నిర్వాసితులకు ఉపాధి లేక బెంగళూరు నగరానికి చాలా మంది వలస వెళ్లి ఉన్నారు. ఇప్పుడు ఈ స్థలంలో ఈ ప్రభుత్వం ఎటువంటి పరిశ్రమలను తీసుకొస్తుందో చూడాల్సి ఉంది. ఇకపోతే మడకశిరను ఒక క్లస్టర్‌గా ప్రకటించారు. వెయ్యి ఎకరాల్లో ఏర్పాటు చేస్తామని చెబుతుండగా ఇది కూడా 2014కు ముందే సేకరించారు. ఇక్కడా పరిశ్రమల ఏర్పాటు జరగలేదు. 2014లో తెలుగుదేశం అదికారంలోకి వచ్చాక కూడా ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్టు హడావుడి నడిచింది. ఆచరణకు మాత్రం నోచుకోలేదు.అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం ప్రాంతంలో తిమ్మసముద్రంలో, డీ.హీరేహళ్ తదితర ప్రాంతాల్లోనూ ఇది వరకు భూసేకరణ చేసి ఉన్నారు. కాని ఒక్క పరిశ్రమ ఇంత వరకు రాలేదు. అంతకు మునుపు ప్రకటించి, ఒప్పందాలు జరిగిన కుదురేముఖ్ ఉక్కు పరిశ్రమ కూడా కార్యరూపం దాల్చలేదు 2012లో నేమకల్లు వద్ద ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఒప్పందం జరిగింది. అయితే ఆ తరువాత అది బుట్టదాఖలైంది. ఈ ప్రాంతంలో విలువైన ఇనుప ఖనిజం కూడా ఉంది. అయినా ప్రభుత్వాలు దీనిపట్ల దృష్టి సారించలేదు. గతంలో మూతబడిన గుంతకల్లు స్పిన్నింగు మిల్లును తెరిపిస్తామని హామీ ఇచ్చి ఉన్నారు. అయితే ఇవేవి ఆచరణకు నోచుకోవడం లేదు. కాని అధికారంలోకి వచ్చిన వెంటనే పాలక పార్టీలు పెద్దఎత్తున ఉపాధిని కల్పిస్తున్నట్టు ప్రచారాలు చేయడం జరుగుతూ వస్తోంది. దశాబ్దకాలంలో వచ్చిన పెద్ద పరిశ్రమ ఏదంటే కియా ఒక్కటే కావడం గమనార్హం. స్థానికంగా ఉపాధి అవకాశాల్లేక అనేక మంది యువత బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు వలస పోతున్నారు. ఉపాధి అవకాశాలు స్థానికంగా కల్పించే పరిశ్రమలు ఎప్పటికి కార్యరూపం దాలుస్తాయన్నది చూడాల్సి ఉంది.

ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

డిక్లరేషన్ పత్రాన్ని అందజేస్తున్న శింగనమల తహశల్దార్ బ్రహ్మయ్య

ప్రజాశక్తి-నార్పల

జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు, పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు.

నార్పల మండల సాగునీటి సంఘం అధ్యక్షులుగా పరంధామ, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలల్లో తహశీల్దార్ ఆరుణకుమారి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా 12 టీసీలకు కేవలం 12 మంది మాత్రమే నామినేషన్ వేయడంతో టీసీ సభ్యులను అధికారులు ఏకగ్రీవంగా ప్రకటించారు. 1వ టిసిగా కుళ్లాయప్ప (బొండలవాడ) 2వ టిసిగా విజయభాస్కర్ (పప్పూరు దుగుమరి బొందలవాడ), 3వ టిసిగా సుధాకర్‌రెడ్డి (దుగుమర్రి), 4వ టీసీగా ఆదినారాయణ (నార్పల), 5వ టిసిగా శ్యాంసుందర్‌రెడ్డి (నార్పల), 6వ టిసిగా పరంధామ, 7వ టీసీగా యోగానంద్‌బాబు (నార్పల), 8వ టిసిగా సుధాకర్ (కురగానపల్లి), 9వ టిసిగా నాగిరెడ్డి (చామలూరు), 10వ టిసిగా గోపాల్‌రెడ్డి (నడిమిదొడ్డి), 11వ టిసిగా చంద్రశేఖర్‌రెడ్డి, 12 టీసీ సభ్యులుగా రామాంజనేయులు (నడిమిదొడ్డి) ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు. అనంతరం అధ్యక్షులు, ఉపాధ్యక్షులతోపాటు టిసి సభ్యులను టిడిపి నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ఆలం నాగార్జున, మహేష్‌నాయుడు, చంద్రబాబు, దుగుమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిటిసి శంకర్‌యాదవ్, పిఎల్ లక్ష్మీనారాయణ, టిడిపి కన్వీనర్ ఎర్రనాగప్ప, తిప్పన్న, పలువురు నాయకులు అభినందించారు.


నార్పల అధ్యక్షులు గవ్వల పరంధామ, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలో మూడో చోట్ల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మండలంలోని వైటీ చెరువు, పాత కొత్తచెరువు, నాగసముద్రం గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. పాత కొత్తచెరువు ఎన్నికల్లో రామచంద్ర, వైటీచెరువులో ఉప్పర రామదాసు, నాగసముద్రంలో మునిస్వామి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సూచన మేరకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలంలోని సాగునీటి సంఘాలన్నీ టిడిపి సొంతం చేసుకుంది. పెద్దవడుగూరు అధ్యక్షులుగా రవిశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎద్దుల మోహనకృష్ణారెడ్డి, దిమ్మగుడి అధ్యక్షులుగా రాజారెడ్డి, ఉపాధ్యక్షులుగా సూర్యనారాయణరెడ్డి, గజరాంపల్లి అధ్యక్షులుగా జయప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా భూమిక, అప్పేచెర్ల అధ్యక్షులుగా గుర్రపు వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా వెంకటనారాయణ, చిత్రచేడు అధ్యక్షులుగా నాగేశ్వర, ఉపాధ్యక్షులుగా లచ్చప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు వారికి అధికారులు డిక్లరేషన్ పత్రాలను అందజేశారు.

ఆత్మకూరు : మండల పరిధిలోని బి.యాలేరు, మదిగుబ్బ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలల్లో తాగనీటి సంఘాలు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాలేరు అధ్యక్షులుగా బండి ముసలన్న, ఉపాధ్యక్షులు గారమిద్ది సాలప్ప, మదిగుబ్బ అధ్యక్షులుగా జింకల రంగప్ప, ఉపాధ్యక్షులుగా చిత్ర నాగభూషణం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు వారితో తహశీల్దార్ లక్ష్మీనాయక్, డిప్యూటీ తహశీల్దార్ బాలమ్మ ఆధ్వర్యంలో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మీనరసింహ, విఆర్‌ఒలు నాగేంద్ర, వీరాంజి, టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, శశాంక్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. కాగా నూతనంగా ఎన్నికైనల తాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టిసి సభ్యులను ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ అభినందించారు.

పుట్లూరు : మండల కేంద్రంతోపాటు కడవకల్లు, ఎస్.గూడూరులో నిర్వహించిన సాగునీటి ఆయకట్టు సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పుట్లూరు సాగునీటి సంఘం అధ్యక్షులుగా పాటిల్ సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా గోపురాజుపల్లికి చెందిన కుమ్మెత రవికుమార్‌రెడ్డి, ఎస్.గూడూరు అధ్యక్షులుగా పెద్ద నాగిరెడ్డి, ఉపాధ్యక్షులుగా రంగనాథ్‌రెడ్డి, కడవకల్లు అధ్యక్షులుగా ఓబుళాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులునాయుడు, ఉపాధ్యక్షులుగా కడవకల్లుకు చెందిన ఎంలింగమయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పుట్లూరు

సత్యనారాయణరెడ్డి అధ్యక్షులు

రవికుమార్‌రెడ్డి ఉపాధ్యక్షులు

కడవకల్లు

శ్రీనివాసులునాయుడు అధ్యక్షులు

ఎం.లింగమయ్య ఉపాధ్యక్షులు

ఎస్.గూడూరు

పెద్ద నాగిరెడ్డి అధ్యక్షులు

రంగనాథ్‌రెడ్డి ఉపాధ్యక్షులు

శింగనమల : మండలంలోని శింగనమల, సలకంచెరువు, కల్లమడి, తరిమెల, గ్రామాల్లో శనివారం సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఇందులో భాగంగా శింగనమల రంగరాయులచెరువు అధ్యక్షులుగా బోయ జి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా శివపురం పట్రా గొల్ల ఎర్రిస్వామి, సలకంచెరువు అధ్యక్షులుగా బాలసంజీవులు, ఉపాధ్యక్షులుగా చిన్న అశ్వర్థమయ్య, కల్లుమడి అధ్యక్షులుగా ఓబుళరాజు, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్, తరిమెల అధ్యక్షులుగా చిన్నరాయుడు, ఉపాధ్యక్షులుగా దండు లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. అలాగే డైరెక్టర్లుగా చిన్న చౌడప్ప, మొండెం చిన్నస్వామి, నరసింహులు, రామన్న ఎన్నికయ్యారు. ఈమేరకు అధికారులు వారందరికీ డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య, టిడిపి నాయకులు లాయర్ పిఎల్.ఈశ్వర్‌రెడ్డి, అట్టే రామాంజనేయులు, శంకర, శ్రీనివాసులు, ఏకిల లక్ష్మయ్య, జానకొండ శ్రీనివాసులు, ఎం.ఆదినారాయణ, మాసుల్ చంద్రమోహన్, బండి వెంకటనారాయణ, జడేజా, ముంతా వెంకటేష్, కాయల సురేష్‌యాదవ్, రమణయాదవ్, కాయగూరల సత్తి, శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : కుందుర్పి మండ్లి చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులుగా పి.రామమూర్తినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గుండప్పగారి లోకేష్, డైరెక్టర్లుగా డైరెక్టర్ అనుమక్క, రమాదేవి, మఠం మల్లికార్జున, లేపాక్షి హనుమంతు ఎన్నికయ్యారు. వీరికి ఎంపిడిఒ లక్ష్మీశంకర్ డిక్లరేషన్ పత్రాలు అందజేశారు. అలాగే నిజవల్లి ఆయకట్ట ఛైర్మన్‌గా బోయ నాగరాజు, మలయనూర్ ఆయకట్ట ఛైర్మన్ బోయ సమాదమ్మను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంఇఒ తిప్పేస్వామి, డిప్యూటీ తహశీల్దార్ తిప్పేస్వామి, నాయకులు తాహిర్, మల్లికార్జున, పెద్ద నరసింహప్ప, రాఘవేంద్రబాబు, రవి, ఆనంద్, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని శ్రీరంగాపురం, గంగవరం, శీర్పి గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. ఇందులో రెండు చెరువుల ఎన్నికలు శ్రీరంగాపురం, గంగవరం ఏకగ్రీవం కాగా శీర్పి చెరువు ఎన్నిక వాయిదా పడినట్లు ఎన్నికల అధికారి సుధాకర్ తెలిపారు. శ్రీరంగాపురం అధ్యక్షులుగా ఈడిగ గంగప్ప, ఉపాధ్యక్షులుగా డి.వన్నూరుస్వామి, టీసీ సభ్యులుగా డి.వన్నూరుస్వామి, ఎం.లక్ష్మీదేవి, ఈడిగ గంగాధర్, కె.లక్ష్మీదేవి, ఇ.గంగప్ప, ఆర్.రత్నమ్మ, గంగవరం అధ్యక్షులుగా ఎల్.రమాదేవి, ఉపాధ్యక్షులుగా జి.మల్లికార్జున, టిసి సభ్యులుగా ఎల్.రమాదేవి, ఎ.శంకరప్ప, హెచ్.కరిబసప్ప, ఎస్.శ్రావ్య, జి.మల్లికార్జున, మన్నే సుజాత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, ఎంపిడిఒ లక్ష్మీనారాయణ, ఎంఇఒ మల్లారెడ్డి, ఎఒ పృథ్వీసాగర్, ఇఒఆర్‌డి నాగేశ్వరశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని పామిడి, ఎద్దులపల్లి, అనుంపల్లి, రామగిరి, పాళ్యం గ్రామాల్లో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. పామిడి ఛైర్మన్‌గా మీనుగ వెంకటేష్, వైస్‌ఛైర్మన్‌గా మారుతీప్రసాద్‌రెడ్డి, ఎద్దులపల్లి ఛైర్మన్‌గా పాళ్యం నరసింహులు, వైస్‌ఛైర్మన్‌గా ఎద్దులపల్లి గోవిందరాజులు, అనుంపల్లి ఛైర్మన్‌గా ఎద్దుల లక్ష్మన్న, వైస్‌ఛైర్మన్‌గా కంచం సుంకయ్య, పాళ్యం ఛైర్మన్‌గా లక్ష్మన్న, వైస్‌ఛైర్మన్‌గా నారాయణస్వామి, రామగిరి ఛైర్మన్‌గా సుదర్శన్, వైస్‌ఛైర్మన్‌గా కేశవనాయక్ ఎన్నికయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : చెన్నంపల్లి సాగునీటి సంఘం అధ్యక్షునిగా ఆలం నాగార్జున నాయుడు, ఉపాధ్యక్షులుగా జొన్న నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు నారాయణస్వామి, ఎస్.నవీద తెలిపారు. అలాగే టిసిలుగా జొన్న నాగమణి, ఎం.రవి, వి.చంద్రశేఖర్, ఈరమ్మ, సి.పెద్దన్న, రాజమ్మ, బి.గోవింద్‌రెడ్డి, కె.గోపాల్, ఎం.ఏక్‌నాథ్‌రెడ్డి, ఆలం నాగార్జున నాయుడు, సి.ఈశ్వరయ్య, జి.లక్ష్మీ నరసింహదాస్ ఎన్నికైనట్లు తెలిపారు.

గుత్తి : మండల వ్యాప్తంగా శనివారం జరిగిన మైనర్ మేజర్ సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మేజర్ సాగునీటి సంఘాలు పెద్దొడ్డి-1.2, 3వ సంఘాల అధ్యక్షులుగా బి.రామకృష్ణ, కెపి.నాగరాజు,డి.నాగరాజు, మాముడూరు సంఘం అధ్యక్షుడిగా నేసే శ్రీనివాసులు, మార్నేంపల్లి సంఘం అధ్యక్షుడిగా ఎ.రామకష్ణ, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి గుత్తి చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఎం.కేశవనాయుడు,


పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న ఆత్మకూరు సాగునీటి సంఘం నాయకులు

నాగేపల్లి (కొత్తపేట) చెరువుకు నాగభూషణం, మాముడూరుకు రఘునాథ్‌రెడ్డి, ఊబిచెర్లకు బోయ శ్రీనివాసులు, బాచుపల్లికి ఎన్.రంగస్వామి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. రిటర్నింగ్ అధికారి, తహసిల్దార్ డి.ఓబులేసు పర్యవేక్షణలో బి.రవి నాయక్, ముస్తాక్ అహ్మద్, మెహర్నిషా బేగం, తదితరులు ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహించారు. సీఐ బి వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.సురేష్ బాబు ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు స్థానిక పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మండల ఇంచార్జి గుమ్మనూరు నారాయణ అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, ఎంకే.చౌదరి, నాయకులు బి. నారాయణస్వామి, ఎ.గోవర్ధన్ గౌడ్, కోనంకి కృష్ణ, చికెన్ శీనా, జక్కులచెరువు గోవిందు, ప్రతాప్, సి.లక్ష్మణ్, ఎ.నరసింహులు, ఎస్ఎం.బాషా, జి.సుంకన్న, డేగ మద్దిలేటి, రంగారెడ్డి, సర్పంచులు పి.భరత్‌కుమార్, యు.రామలింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : ఎంపిబిఆర్‌డ్యాం దక్షిణ కాలువ 8, 5 డిస్ట్రిబ్యూటర్ మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు, ఎర్రగుంట్ల, జంబులదిన్నె, బ్రాహ్మణపల్లి, పెనకచర్ల మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. ఇందులో భాగంగా 8వ డిస్ట్రిబ్యూటర్ అధ్యక్షులుగా కె.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా ఎన్.వెంకటరమణ, 5 డిస్ట్రిబ్యూటర్‌లో ఎర్రగుంట్ల అధ్యక్షులుగా మోదుపల్లి అరవిందనాయుడు, ఉపాధ్యక్షులుగా గోరకాటి శ్రీనివాసులును ఎన్నుకున్నారు. మైనర్ ఇరిగేషన్ సంబంధించి ఎర్రగుంట్లకు జి.చంద్రశేఖర్, జమ్ములదిన్నెకు ఎం.రాంభూపాల్‌రెడ్డి, బ్రాహ్మణపల్లికి కృష్ణయ్య, పెనకచర్లకు రామ్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈరమ్మ, ఎంఇఒ తారా చంద్రానాయక్, ఎంపిడిఒ యోగానందరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మూడు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. నాగిరెడ్డి పరిధిలోని కొళేగాళ్ అధ్యక్షుడిగా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, వేపరాల అధ్యక్షుడుగా రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడిగా సిద్ధన్న, బి.ఎన్ హళ్లి అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా గొల్లప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉరవకొండ : మండలంలోని బూదగవి మైనర్ ఇరిగేషన్ ట్యాంకు సంబంధించి సాగునీటి సంఘం ఎన్నిక ఏకగ్రీవమైనట్లు మండల వ్యవసాయ అధికారి శుభకర్ తెలిపారు. సాగునీటి సంఘం అధ్యక్షులుగా కెవి.తిమ్మప్ప, ఉపాధ్యక్షులుగా కెపి.తిమ్మక్క ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చిరంజీవి, రామస్వామి, రైతులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : శ్రీధర్‌ఘట్ట చెరువు అధ్యక్షులుగా కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, హరేసముద్రం అధ్యక్షులుగా హనుమంతప్ప, ఉపాధ్యక్షులుగా హనుమంతురెడ్డి, గోనేహాల్ అధ్యక్షులుగా కేశవరెడ్డి, ఉపాధ్యక్షులుగా మల్లికార్జున, కొలగానహళ్లి అధ్యక్షులుగా గోపాల్, ఉపాధ్యక్షులుగా వన్నూరుస్వామి, దేవగిరి అధ్యక్షులుగా నటరాజు, ఉపాధ్యక్షులుగా గోవిందరాజులు, కల్లుదేవనహళ్లి అధ్యక్షులుగా సుంకన్న, ఉపాధ్యక్షులుగా ముక్కన్న ఏకగ్రీవకంగా ఎన్నికయ్యారు.

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని పాలవాయి సాగునీటి సంఘం అధ్యక్షులుగా పాలవాయి ఈశ్వరప్ప, ఉపాధ్యక్షులుగా మల్లాపురం లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుని ఆదేశాల మేరకు టిడిపి మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు ఘనంగా సత్కరించారు.

కణేకల్లు : కణేకల్లు చెరువు సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షునిగా బిటి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కణేకల్లులోని జెడ్పీ బాలుర హైస్కూల్లో శనివారం సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. తొలిత రైతులు 12 మంది టీసీ సభ్యులను ఎన్నుకున్నారు. తర్వాత టిసి సభ్యులు అధ్యక్షునిగా బీటి రమేష్, ఉపాధ్యక్షులుగా తిప్పేస్వామిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

కణేకల్లులో డిక్లరేషన్ అందుకుంటున్న బిటి రమేష్, తిప్పేస్వామి

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం నియోజకవర్గం చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో మెగా జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపినట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. రెండు రోజులుగా పట్టణంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా రెండు రోజుల్లో 2,367 మందికి ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబ్‌మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. మొత్తం ఆన్‌లైన్ ద్వారా 5681 మంది, ఆఫ్‌లైన్‌లో 952 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 2367లి మందికి ఆఫర్ లెటర్లు ఇచ్చినట్లు తెలిపారు. వేలాదిగా తరలివచ్చిన వారికి ఎమ్మెల్యే భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

జాబ్‌మేళాకు తరలివచ్చిన నిరుద్యోగులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అమర్నాథ్ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహాలతో పాటు కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య చికిత్సలు నిర్వహించారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వైద్య, రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగలక్ష్మి, ల్యాబ్ టెకీషియన్ సుందర్, రాజేశ్వరి, వసతి గృహం వార్డెన్ సంజీవరాయుడు, కెజిబివి పాఠశాల ప్రిన్సిపల్ ఉషా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నూతన రథం నిర్మాణానికి విరాళం

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతన రథం నిర్మాణానికి ఉరవకొండకు చెందిన సల్లాపురం రామన్న, అనుమక్క కుమారుడు సల్లాపురం ప్రసాద్, కుటుంబసభ్యులు రూ.10,116 విరాళం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాణాధికారి సాకే రమేష్‌బాబు, తదితరులు తెలిపారు.

గొర్రెలకు టీకా వేయించాలి

ప్రజాశక్తి-బెలుగుప్ప

గొర్రెల కాపరులు నీలి కాలుక వ్యాధికి తప్పకుండా టీకాలు వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ సూచించారు. మండల పరిధిలోని రమనేపల్లి గ్రామంలో ఉన్న గొర్రెల కాపరులు గొర్రెలు అనారోగ్యానికి గురవుతున్నాయని ఫిర్యాదు చేయడంతో శనివారం గ్రామానికి చేరుకుని గొర్రెల మందలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గొర్రెలకు నీలినాలుక వ్యాధి లక్షణాలు ఉన్నాయన్నారు. కావున టీకాలు తప్పక వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు విజయ్‌కుమార్, అనిల్, గొర్రెల కాపరులు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు టీకాలు వేస్తున్న డాక్టర్ రమేష్

పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 21వతేదీ వరకూ 'ఏఐ ఇంటిగ్రేటెడ్ నెక్స్ జనరేషన్ సెమీకండక్టర్ డివైసెస్' అనే అంశంపై జాతీయ స్థాయి ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డిపి) నిర్వహించనున్నట్లు కళాశాల ఛైర్మన్ పల్లె కృష్ణకిషోర్ తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక కళాశాలలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, హ్యూమానిటీస్, సైన్సెస్ విభాగాధిపతి కిరణ్‌కుమార్, లక్ష్మీనరసప్ప, చంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న పివికెకె సిబ్బంది

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలు, అంబేద్కర్ భవన్ వెనకవైపు ఉన్న గురుసదన్ ఆశ్రమంలో విద్యార్థులకు శనివారం అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు ఎస్.మహేశ్వరయ్య, సతీమణి జె.విజయలక్ష్మి కుమార్తె ఎస్.మృతిశ్రీ పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలామురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్రమణ్యం, ఓబుళపతి, రవికుమార్, మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

డ్రెయినేజీ పరిశీలన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో డ్రెయినేజీని మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ బిక్కీ రామలక్ష్మి లిగోవిందప్ప శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా డ్రెయినేజీని శుభ్రం చేయించారు. అనంతరం పారిశుధ్యం సమస్య పరిష్కరించాలని స్థానికులు విన్నవించారు. ఇందుకు స్పందిస్తూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ అలీఖాన్, సుగేపల్లి నరేష్, ఐ టిడిపి పూజారి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

వ్యక్తి అదృశ్యం కేసు ఛేదింపు

రాఘవను కుటుంబ సభ్యులకు అప్పగింత

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ రాఘవ అదృశ్యమైన కేసును ఎట్టకేలకూ పోలీసులు ఛేదించారు. పోలీస్ ఉన్నతాధికారుల సహకారంతో ఎస్ఐ సాగర్ కేసును ఛాలెంజింగ్‌గా తీసుకుని ప్రత్యేక పోలీసు బలగాలతో రాఘవ ఆచూకీ కనుగొన్నారు. ఈమేరకు రాఘవను అనంతపురంలో అదుపులోకి తీసుకుని నార్పల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులను పిలిచి అప్పగించారు. దీంతో రాఘవ కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాఘవను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

యుటిఎఫ్ మోడల్ పేపర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన 10వ తరగతి మోడల్ పేపర్లను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఉరవకొండలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థుల కోసం మాదిరి పరీక్ష పేపర్లను ముద్రించడం శుభ పరిణామమన్నారు. యుటిఎఫ్ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసమే కాకుండా విద్యార్థుల శ్రేయస్సు కోసం పని చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా ఆడిట్ సభ్యులు రాజశేఖర్, మండల నాయకులు జయరాములు, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, శ్రీధర్, రఘు, నరసింహులు, శ్రీనివాసగుప్తా, బండయ్య, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మోడల్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పయ్యావుల

లోక్‌అదాలత్‌లో 530 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-గుత్తి

మండల న్యాయ సేవా సమితి ఛైర్మన్, ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథచారి ఆధ్వర్యంలో శనివారం స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కార్యక్రమంలో గుత్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామశర్మ, ఉపాధ్యక్షుడు పిడి రత్నం, ఎపిపి బుసా సుధీర్‌రెడ్డి, ఎజిపి తిమ్మారెడ్డి, న్యాయవాదులు మహేష్‌కుమార్, ఫక్రుబాషా, జెడ్.సతీష్, టి.ధనుంజయ, శ్రీనివాసులు, కె.మనోహర్‌బాబు, మహమ్మద్ రసూల్, నూర్ మొహమ్మద్, ఓబులేసు, టైపిస్ట్ ఎస్.సాదిక్‌వలి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదుకు విరాళం

అనంతపురం రూరల్ : సభ్యత్వాల నమోదు కోసం టిడిపి డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ లక్ష్మీప్రసాద్ రూ.50 వేల విరాళం అందజేశారు. ఈమేరకు శనివారం అర్బన్ టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్‌కు 20వ డివిజన్ నాయకులతో కలిసి సంబంధిత మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు.

విరాళం మొత్తాన్ని అందజేస్తున్న టిడిపి నాయకులు లక్ష్మీప్రసాద్

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని లక్ష్మీనగర్‌లో ఉన్న క్రిసెంట్ రైన్బో హోమ్‌లోని చిన్నారులకు ఆప్త మిత్ర ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆప్తమిత్ర ఆర్గనైజేషన్ స్థాపకుడు అభి మాట్లాడుతూ చదువే మన ఆయుధం కావాలన్నారు. కేవలం చదువు ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమన్నారు. కావున ప్రతి విద్యార్థి తప్పకుండా ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు నూర్ మహమ్మద్, శివ చరణ్, మన్సూర్, సాకే అశోక్, అభి, జస్వంత్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఆప్తమిత్ర ఆర్గనేజేషన్ సభ్యులు

ఐదేళ్లలో రైతుల కష్టంపై స్పందించారా..?

ఎమ్మెల్యే పరిటాల సునీత

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

గత ఐదేళ్లలో వైసిపి నాయకులు రైతుల సమస్యలపై నోరు మెదపకుండా.. ఇప్పుడు బయటకు వచ్చి రైతు పోరుబాట పేరుతో మొసలి కన్నీరు కార్చడం బాధాకరమని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లపాటు వైసిపి నాయకులు కలుగులో దాక్కొని ఇప్పుడు వచ్చి తమను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసిపి నాయకులకు లేదన్నారు. ముఖ్యంగా అనంతపురం జిల్లా రైతులకు చేసిన ద్రోహం అంతా ఇంతా కాదన్నారు. జిల్లాలో సాగునీటి వనరులు తక్కువగా ఉన్న నేపథ్యంలో సూక్ష్మ సేద్యానికి గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో సహకారం అందించారని గుర్తు చేశారు. అందుకే రైతులు విరివిగా పండ్ల తోటలు సాగు చేశారన్నారు. అయితే గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఎంత మంది రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆరునెలలుగా కనిపించని వారంతా.. ఇప్పుడు బయటకొచ్చి రైతులపై ప్రేమ ఉన్నట్టు డ్రామాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి డ్రామాలను రైతులే కాదు.. ఏఒక్కరూ నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ ఎంపిపి రంగయ్య పాల్గొన్నారు.

పల్లకిలో ఊరేగుతున్న నరసింహ స్వామి

వైభవంగా శ్రీవారి పల్లకి ఉత్సవం

ఉరవకొండ : మండలంలోని పెన్నఅహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకి ఉత్సవం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ సాకే రమేష్ బాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం

మైనార్టీల సంక్షేమం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం అనంతపురం జడ్పీ కార్యాలయంలోని డిఆర్‌సి సమావేశం హాల్‌లో ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ సలహాదారులు మహమ్మద్ షరీఫ్‌ను ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ముస్లిం మైనారిటీ సంఘాల ప్రతినిధులు ఘనంగా ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ మైనారిటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఫక్రుద్దీన్, షేక్షావలి, ఫారూక్ మహమ్మద్, జిలాన్, అశ్రఫ్‌అలీ, దౌలా, అన్వర్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సాలార్ బాషా, గౌస్, మూర్తి, తాజ్, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ సలహాదారులు మహమ్మద్ షరీఫ్‌ను సన్మానిస్తున్న ఆల్‌మేవా నాయకులు